క్లుప్తంగా

సీతారాములకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో సీతారాములు

మహానంది: శివకేశవులకు నిలయమైన మహానందిలో కొలువైన శ్రీ సీతారాముల వారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకం, అర్చన, మహామంగళ హారతులు జరిపారు. పలు ప్రాంతాల భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

నేటి నుంచి భూముల రీ సర్వే

పాములపాడు: భూమల రీ సర్వే ప్రాజెక్ట్‌లో భాగంగా పైలట్ గ్రామంగా ఎంపికైన పాములపాడులో సోమవారం నుంచి భూముల రీ సర్వే నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ భూములు కలిగిన రైతులందరికీ నోటీసులు జారీ చేయడంతో పాటు వాట్సాప్ సందేశం కూడా పంపుతామని వెల్లడించారు. నోటీసులు అందుకున్నా రైతులు రీ సర్వేకు సహకరించాలని కోరారు. పట్టాదారు పుస్తకం, ఆధార్ కార్డు నకలు పత్రాలతో సర్వే అధికారుల ఎదుట హాజరు కావాలన్నారు.

దివ్యాంగులకు మందుల పంపిణీ

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఐఎంఏ వైద్యుల సహకారంతో దివ్యాంగులకు ఆదివారం మందులు పంపిణీ చేశారు. సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ దివ్యాంగులకు దీర్ఘకాలిక జబ్బులకు ప్రతి నెల రూ.15వేల విలువజేసే అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. అనంతరం వైద్యులను సంఘం నాయకులు సత్కరించారు. వైద్యులు భార్గవవర్ధన్ రెడ్డి, తారకేశ్వరరెడ్డి, అశోక్, పాండురంగారావు, రమణయ్య, మధు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

నంద్యాల(వ్యవసాయం): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్ ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు ఆదివారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో బహుమతులు అందజేశారు. సంఘం అధ్యక్షుడు నగరడోన సుధీర్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోని బ్రాహ్మణ మహిళలు పాల్గొన్న పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశామని చెప్పారు.

24 నుంచి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు

చాగలమర్రి: మండల కేంద్రంలోని బుగ్గరస్తా క్రీడా మైదానంలో ఈ నెల 24వ తేదీ నుంచి నియోజకవర్గ స్థాయి హార్డ్ టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అల్తాఫ్, రఫీ తెలిపారు. మొదటి బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ రూ.5 వేలు నగదు బహుమతులను అందజేస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న జట్లు ఈ నెల 23వ తేదీలోపు 6301659818, 9398523698 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

నంద్యాల(వ్యవసాయం): స్థానిక ఆర్ఎస్ రోడ్డులోని సంఘమిత్ర నిరాశ్రిత బాలుర ఆవాస కేంద్రం వార్షికోత్సవం సందర్భంగా కేంద్రం విద్యార్థులు ప్రదర్శించిన సందేశాత్మకమైన నాటికలు, జానపద గీతాలు, దేశ భక్తి పాటలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆదివారం సంఘమిత్ర 31వ వార్షికోత్సవ వేడుకలు స్థానిక ప్రథమనంది దేవస్థానంలోని వైఎస్సార్ కల్యాణ మండపంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, బీజేపీ పార్లమెంటరీ అధ్యక్షుడు అభిరుచి మధు, ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్త, సంఘమిత్ర అధ్యక్షుడు కర్నాటి నాటసుబ్బారెడ్డి, చిలుకూరి శ్రీనివాస్‌పాండే, గంగదాసరి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుడిలో చోరీ

ఉయ్యాలవాడ : మండలంలోని ఇంజేడు గ్రామంలో వెలిసిన లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పట్టపగలే చోరీ జరిగింది. గ్రామస్తులు, ఆలయ పూజారి రమణయ్య అందించిన సమాచారం మేరకు.. ప్రతిరోజులాగే ఆదివారం ఉదయం పూజారి ఆలయంలో పూజ చేసి ఇంటికెళ్లాడు. ఆ సమయంలో స్వామి విగ్రహంపై ఆభరణాలున్నాయి. తిరిగి సాయంత్రం పూజారి ఆలయానికి చేరుకొని తలుపులు తెరిచిచూడగా స్వామికి అలంకరించిన వెండి పాదాలు, భక్తులకు తీర్థం వేసే వెండి గిన్నె, గరిటె, శఠగోపంతో పాటు కిలో మేరకు వెండి సామన్లు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని నిర్ధారించుకొని గ్రామస్తులతో కలిసి ఉయ్యాలవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పశు వైద్యం.. దైన్యం

- శిథిలావస్థలో పశు వైద్యశాలల భవనాలు
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- అవసరమైన మందులు లేక అవస్థలు



నందికొట్కూరు పట్టణంలో శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల



10 బొల్లవరంలో పెచ్చులూడుతున్న పశువైద్యశాల

నందికొట్కూరు: ప్రభుత్వం మూగ జీవాల వైపు కప్పట ప్రేమ చూపిస్తోంది. బ్రిటీషు కాలంలో నిర్మించిన భవనాల్లోనే వైద్యశాలలను నిర్వహిస్తూ పశువులకు చికిత్సలు అందిస్తున్నారు. శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనాల్లో వైద్యులు ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొన్ని విధులు నిర్వర్తించాల్సి పరిస్థితి దాపురించింది. అదే విధంగా సిబ్బంది కొరత, పశువులకు చికిత్సలందించేందుకు సరైన మందులు కరువయ్యాయి.

మందుల కొరత

నందికొట్కూరు, మిడుతూరు, పగిడ్యాల, పాములపాడు, కొత్తపల్లి, జూపాడుబంగ్లా మండలాల్లో మొత్తం బర్రెలు 36 వేలు,ఎద్దులు, ఆవులు 25 వేలు, గొర్రెలు, మేకలు 2 లక్షల 10 వేలు ఉనట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. పాల ఉత్పత్తి పెంచేందుకు ఎముకల పొడి, కాల్షియం, తదితర మందు లు అందుబాటలో లేవు. అంతేకాకుండా పశువులకు వైద్యం అందించేందుకు సిబ్బంది కొరత ఉంది.

శిథిలమైన భవనాలు

నందికొట్కూరు పట్టణంలోని పశు వైద్యశాలను 1901లో నిర్మించారు. కొద్దిపాటి వర్షం కురిసినా పైకప్పు కారుతూ మందులు, ధాన్యం, గడ్డి గింజలు తడిసిపోతున్నాయి. నియోజకరవర్గంలోని కడుమూరు, కొణిదేల, వడ్డేమాన్, తంగడంచ, బన్నూర్, మండ్లెం, ప్రాతకోట, కొత్తపల్లి, జీ. వీరాపురం, మద్దూరు, కొక్కెరంచ గ్రామాల్లో ప్రభుత్వ పశువైద్యశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మండల టీడీపీ నాయకులు, మాజీ ఎంపీపీ ప్రసాదరెడ్డి సొంత గ్రామమైన 10 బొల్లవరం గ్రామంలో ఉన్న పశువైద్యశాల్లోపై కప్పు పెచ్చు లూడడం వల్ల వైద్యులు, సిబ్బంది ప్రాణాలను అరిచేతిలో పెట్టుకుని విధులకు హాజరవుతున్నారు. ఆరు నెలల క్రితమే నూతన భవనానికి శంకుస్థాపన చేస్తామని హామీలిచ్చిన నేటికీ అమలుకు నోచుకోలేదు.

కూటమి పాలనలో మందుల కొరత



కూటమి పాలనలో పశువులకు మందులు అందుబాటులో లేక ప్రైవేట్ మందుల దుకాణాలను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది. మా గ్రామంలో పశు వైద్యశాల శిథిలావస్థకు చేరింది. పశువులను వైద్యశాలకు తీసుకెళ్లాలంటే భయంగా ఉంది. ప్రభుత్వం స్పందించి పశువైద్యశాలలకు నూతన భవనాలు మంజూరు చేసి మందుల కొరత లేకుండా చూడాలి. మారుమూల గ్రామమైన మా ఊరు కృష్ణ నది ఒడ్డున ఉంది. మండల కేంద్రానికి వెళ్లాలంటే 10 కిలో మీటర్లు ఉంది. మందులు మంజూరు చేసి పశువులకు వైద్య చికిత్సలు అందించాలి. – జయరాం రైతు, కొక్కెరంచ

పశు వైద్యశాల కూలేందుకు సిద్ధంగా ఉంది



పశువు వైద్యశాల కూలేందుకు సిద్ధంగా ఉన్నా ప్రజాప్రతినిధులు, నాయకులు పట్టించుకోవడం లేదు. నోరులేని మూగ జీవాలకు కనీసం పశువైద్యశాల్లో వసతులు లేవు. పశు వైద్యశాల కూలేందుకు సిద్ధంగా ఉందని, నూతన భవనం నిర్మించాలని అధికారులకు వినతి పత్రాలను అందజేసిన ఫలితం లేదు. పాలకులు వాగ్దానాలు చేసినా పశువైద్యశాలకు నూతన భవనం నేటికి మంజూరు చేయలేదు. ఎప్పుడు కూలుతుందో తెలియక పశు వైద్యశాల అధికారులు, సిబ్బంది భయాందోళన చెందుతున్నారు.
– నాగభూషణంరెడ్డి రైతు, 10 బొల్లవరం

నాయీ బ్రాహ్మణ సత్రం క్యాలెండర్ ఆవిష్కరణ

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని అఖిలభారత నాయీ బ్రాహ్మణ సంఘ సత్రం కార్యవర్గ సభ్యులు, టౌన్ ప్లాన్ ఆఫీసర్ ఎస్ రంగస్వామి ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఫిబ్రవరిలో జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఏర్పాట్లపై ఆదివారం సాయంత్రం సత్రం కార్యవర్గ సభ్యుల సమీక్ష సమావేశం నిర్వహించారు. 2024 సంవత్సరానికి సంబంధించిన జమా ఖర్చులను నివేదించి ఆడిట్ రిపోర్టును సత్రం కార్యదర్శి శివయ్య సమర్పించినట్లు సత్రం అధ్యక్షులు ఆదినారాయణ తెలిపారు. కార్యక్రమంలో సత్రం కోశాధికారి పోలేశ్వరరావు, రాఘవేంద్ర, శంకర్, మధు, సత్ర గదుల నిర్మాణదాతలు లక్ష్మీనారాయణ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

జూపాడుబంగ్లా: పశు ఆరోగ్యవైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ అసిస్టెంటు డైరెక్టర్ రామాంజనేయనాయక్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం నుంచి ఈ నెలాఖరు వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పశువులు, దూడ లు, జీవాలకు నట్టల నివారణ మందు తాగించడంతో పాటు టీకాలు, వైద్య చికిత్సలు అందజేస్తారన్నారు. 20న పారుమంచాల, 21న తర్తూరు, 22న తాటిపాడు, పి.లింగాపురం, 23న తూడిచెర్ల, 24న 80బన్నూరు, భాస్కరాపురం, 25న తరిగోపుల, 27న రామసముద్రం, 28న జూపాడుబంగ్లా, తంగడంచ, 29న పోతులపాడు, 30న మండ్లెం గ్రామా ల్లో పశు ఆరోగ్య వైద్యశిబిరాలు ఉంటాయన్నారు.

అంబేడ్కర్ పేరు వింటే వణుకెందుకు?



రాస్తారోకో చేస్తున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు

నందికొట్కూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు వింటేనే అమిత్ షాకు ఎందుకు వణుకు పుట్టిందని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర స్టాండింగ్ కమిటీ సభ్యులు ఉదయ్ కిరణ్ ప్రశ్నించారు. ఆదివారం పట్టణంలోని పగిడ్యాల రోడ్డు వాల్మీకి నగర్ ఆ పార్టీ ఆధ్వర్యంలో అమిత్ షా విజయవాడ పర్యటనను వ్యతిరేకిస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై విషపూరిత వ్యాఖ్యాలు చేసిన అమిత్ షాకు దేశ ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర హోంమంత్రి పదవికి ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, బీబీ, రామకృష్ణ, షేక్షావలి, మహబూబ్ బాషా, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా.. గో బ్యాక్..

పగిడ్యాల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా గో బ్యాక్ అంటూ ఆదివారం కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కే. రంగమ్మ ఆదివారం పగిడ్యాల దేవనగర్ కాలనీలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మండల అధ్యక్షురాలు గంధం ఉసేనమ్మ ఆధ్వర్యంలో జరిగిన నిరసన డప్పు కళాకారులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

కొత్తపల్లి: పార్లమెంట్ సాక్షిగా అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్ షాను బర్తరఫ్ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎన్.స్వాములు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా నాయకులు పాతకోట భాస్కర్, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు బొల్లు ప్రసాద్ బాబు యాదవ్, దళిత నాయకులు గూడెం బలనాగన్నలు డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తపల్లి మండలంలో గాంధీ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రాతకోట వెంకటరమణ, అంకన్న, మార్తపు ప్రభుదాస్, మోక్షేశ్వరుడు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నరసింహయ్యను ఆదర్శంగా తీసుకోవాలి



తెలకపల్లి నరసింహయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: మార్క్సిస్టు పార్టీ కర్నూలు జిల్లా ఉద్యమ నిర్మాత తెలకపల్లి నరసింహయ్యను ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, మండల కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని డాక్టర్ ధనుంజయ మీటింగ్ హాల్‌లో కర్నూలు తెలకపల్లి నరసింహయ్య 6వ వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ పట్టణ నాయకులు వీరన్న, భాస్కర్, నాయకులు ఎ.కిరణ్, రమణ, నభి, రవి, రైట్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నరసింహయ్య సేవలు ఎనలేనివి

పాములపాడు: సీపీఎం పార్టీ ఉమ్మడి జిల్లా ఉద్యమ నిర్మాత నరసింహయ్య సేవలు ఎనలేనివని పార్టీ సీనియర్ నాయకులు రామేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నరసింహ నాయక్ అన్నారు. ఆదివారం పాములపాడు గ్రామంలో నరసింహయ్య వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సోమన్న, నాయకులు రాజు, రమణ, అంకన్న, సర్ఫుదీన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు మాజీ ఎమ్మెల్యే శిల్పా రాక

వెలుగోడు: మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి సోమవారం వెలుగోడుకు రానున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి ఆదివారం తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన అందుబాటులో ఉంటారన్నారు. మండల నాయకులు, కార్యకర్తలు వచ్చి వారి వారి సమస్యలను విన్నవించుకోవచ్చన్నారు.

21 నుంచి ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

జూపాడుబంగ్లా: ఈనెల 21 నుంచి 24 తేదీ వరకు నాలుగు రోజుల పాటు ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 21, 22 తేదీలలో జూపాడుబంగ్లాలోని జంగాలపేట ప్రాథమిక పాఠశాల వద్ద, 23, 24 తేదీలలో తరిగోపుల అంగన్‌వాడికేంద్రం–3 బీసీకాలనీలో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ముందురోజు పంచాయతీ కార్యదర్శులు దండోరా వేయించి ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు విషయాన్ని గ్రామ ప్రజలకు తెలియజేయాలన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా



అస్వస్థతకు గురైన షఫీవున్‌తో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- బాధిత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, కుటుంబాలకు పరామర్శ

ఆత్మకూరు: ఎవరూ అధైర్య పడొద్దు, మీకు నేను అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి భరోసా కల్పించారు. ఇటీవల అస్వస్థతకు గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలను స్వయంగాకలిసి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరికి సహాయ సహకారాలు అందజేస్తానని, కార్యకర్తలకు అప్పుడప్పుడు అనుకోకుండా సమస్యలు ఏర్పడినా, ఎలాంటి ఇబ్బందులు వచ్చినా పరిష్కరిస్తామని చెప్పారు. ఏ సమస్య వచ్చినా తమదృష్టికి తీసుకురావాలని సూచించారు.

కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ

వైఎస్సార్‌సీపీ 1వ వార్డు సభ్యులు కరిముల్లా సతీమణి షఫీవున్‌ను వెలుగు సీసీ వెంకటేశ్వర్లు ఇబ్బందులకు గురి చేయడంతో శనివారం ఆమె అస్వస్థతకు గురైంది. దీంతో మాజీ ఎమ్మెల్యే స్వయంగా షఫీవున్ ఇంటికెళ్లి పరామర్శించారు. అలాగే వెంకటాపురం గ్రామంలో రిటైర్డ్ వీఆర్వో సింగారెడ్డి రమణారెడ్డి ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రాష్ట్ర మాజీ మైనార్టీ చైర్మన్, హజ్ కమిటీ మాజీ రాష్ట్ర చైర్మన్ అహ్మద్ హుసేన్ ఇంటికెళ్లి కుటుంబ సభ్యులను కలిసి స్నేహపూర్వకంగా మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, వార్డు కౌన్సిల్ సభ్యులు విజయ్‌చౌదరి, మారుబోతులస్వామి, బాలస్వామియాదవ్, తిమోతీ, దర్గమ్మ, పార్వతి, మరియమ్మ, కరిముల్లా, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రసగుళికలు వేమన పద్యాలు



వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీ స్రవంతి సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): సమాజంలోని అసమానతలు, మూఢనమ్మకాలపై తన అక్షరాస్త్రాలను సంధించిన, సాహితీ దేవుడు వేమన అని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. ఆదివారం సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో పింగళి సూరన శాఖా గ్రంథాలయంలో యోగి వేమన జయంతిని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు కంటే సంస్కారం ముఖ్యమని తన పద్యాల ద్వారా యువతను హెచ్చరించారని గుర్తు చేశారు. తెలుగు పండిట్ అన్నెం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో నాటుకొని పోయిన అంధ విశ్వాసాలపై వేమన సంధించిన పద్యాలన్నీ చురకత్తులవంటివన్నారు. అనంతరం గ్రంథాలయానికి స్టడీ ప్యాడ్‌లను అందజేశారు. కవులు నీలం వెంకటేశ్వర్లు, శ్రీధర్, మహబూబ్‌బాషా, మధుసూదన్, ప్రసాద్ పాల్గొన్నారు.

కురవలకు ఎస్సీ సర్టిఫికెట్ రద్దుపై హర్షం

నందికొట్కూరు: మాదాసి, మాదారి కురవకు ఎస్సీ కులం సర్టిఫికెట్‌ను హైకోర్టు రద్దు చేయడం హర్షించదగ్గ విషయమని దళిత బహుజన ఫ్రంట్ మహిళా ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలు వేల్పుల జ్యోతి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని దామగట్ల గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆమెతో పాటు దళిత నాయకులు డాక్టర్ చంద్రశేఖర్ పాలాభిషేకం చేశారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ మాదాసి కురవ, మదారి కురవకు సంబంధించిన ఎస్సీ కులం సర్టిఫికెట్ పొందే జీఓ 58ను హైకోర్టు రద్దు చేసి రాజ్యాంగాన్ని కాపాడిందన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచు ఏసుతర్నం, దళితులు చిన్న నాగన్న, బాల వెంకటసుబ్బయ్య, సత్యం, సురేష్, కన్నా, దేవసహాయం, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్యాడ్మింటన్, షటిల్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): రిపబ్లిక్ డేను పురస్కరించుకొని నంద్యాల కాస్మో పాలిటన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి జిల్లాల బ్యాడ్మింటన్, షటిల్, డబుల్స్, మిక్స్‌డ్, ట్రిపుల్స్ పోటీలు కొసాగాయి. స్పోర్ట్స్ సెక్రటరీ కాంతారెడ్డి, టోర్నమెంట్ కన్వీనర్ ఖాన్ పాల్గొని బ్యాడ్మింటన్ క్రీడాకారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఉదయం 6 నుంచి రాత్రి 11గంటల వరకు ఫ్లడ్ లైట్స్ వెళుతురులో క్లబ్ ఆవరణలో పోటీలు జరుగుతున్నాయని వారు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి 20వ తేదీన 40,50 సంవత్సరాలు పైబడిన, మిక్స్‌డ్ ట్రిపుల్స్ టోర్నమెంట్‌లో 30ప్లస్, 40ప్లస్, 60ప్లస్ విజేతలకు వరుసగా..రూ.6వేలు, రూ.4వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి అందజేస్తామని చెప్పారు.

ఏకగ్రీవంగా ఖజానా సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నికలు

నంద్యాల(అర్బన్): స్థానిక జిల్లా ఖజానా కార్యాలయంలో ఆదివారం ఖాజా, లెక్కల సర్వీసెస్ అసోసియేషన్ నంద్యాల జిల్లా శాఖ కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికల అధికారిగా ప్రభుదాసు, సహాయ ఎన్నికల అధికారిగా సురేష్, ఎన్నికల పరిశీలకులుగా అనిల్ వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా శ్రీనివాసరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా తేజాబాబు, ఉపాధ్యక్షులుగా సుమలత, భాస్కరరెడ్డి, దినేష్‌కుమార్, ట్రెజరర్‌గా శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాజేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా ప్రవీణ్‌కుమార్, సుబాషిణి, మురళీకృష్ణుడు ఎన్నికయ్యారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం

సిద్ధాపురంలో కార్డన్ సర్చ్



సిద్ధాపురంలో పట్టుబడిన ద్విచక్రవాహనాలు



నాటుసారా బట్టీలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఆత్మకూరు/ఆత్మకూరురూరల్: మండలంలోని సిద్ధాపురం గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున పోలీసుల కార్డన్ సర్చ్ నిర్వహించారు. అర్బన్ సీఐ రాము, ఎస్ఐ నారాయణరెడ్డిల ఆధ్వర్యంలో పోలీసులు గ్రామంపై హఠాత్తుగా దాడి చేసి, ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గ్రామంలో మొత్తం 12 రికార్డులు లేని ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ మాట్లాడుతూ.. గ్రామంలో కొందరు నాటుసారా తయారీ, పంపిణీ చేస్తున్నారని, మరికొందరు అడవుల్లో వన్యప్రాణులను వేటాడుతూ మాంసాన్ని విక్రయిస్తున్నారన్నారు. అలాంటి వారి పట్ల కఠినంగా ఉంటామని స్పష్టం చేశారు.

నాటుసారా స్థావరాలపై పోలీసుల దాడి

సిద్ధాపురం పరిసర ప్రాంతాల్లోని అడవుల్లో నాటుసారా స్థావరాలపై ఆత్మకూరు పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. నాటుసారా కాసేవారు పోలీసులను చూసి అక్కడి నుంచి పారిపోగా, తయారీకి సిద్ధంగా ఉన్న బట్టీలను పోలీసులు ధ్వంసం చేశారు. అంతే కాక నాటుసారా తయారీ కోసం నిల్వ చేసిన మూడువేల లీటర్ల బెల్లం ఊటను పారబోశారు. అదే సమయంలో అక్కడ ఉన్న 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు.

ఆదమరిస్తే కాలువలోకే !



రోడ్డు పక్కనే ఉన్న కాలువ

బండిఆత్మకూరు: నంద్యాల–ఆత్మకూరు ప్రధాన రహదారిలోని పెద్దదేవుళాపురం గ్రామ సమీపంలో రోడ్డుకు ఒకవైపు సైడు బర్మ్ పూర్తి గా లేకపోవడంతో వాహనదారులు ఆదమరిస్తే ప్రమాదం భోటుచేసుకునే అవకాశం ఉంది. పక్కనే లోతైన కాలువ ఉండటంతో ప్రమాదం పొంచి ఉంది. ఈ రోడ్డులో ప్రముఖ పుణ్యక్షేత్రాలైన శ్రీశైలం, మహానంది ఉండటంతో ప్రతి రోజు వందలాది వాహనాలు తిరుగుతుంటా యి. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా సైడ్‌బర్మ్ ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

చెత్త మార్కెట్..!



చెత్తకుప్ప వద్ద ఏర్పాటు చేసిన కూరగాయల దుకాణం

బండిఆత్మకూరు: మండల కేంద్రమైన బండిఆత్మకూరులో ప్రతి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి సంతను నిర్వహిస్తారు. అయితే సంత నిర్వహించే పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంత ప్రాంతంలో చెత్తాచెదారం నిండి ఉండటంతో వాటి నుంచే దుర్వాసన వస్తోంది. అలాగే పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. సంత వేలం పాట ద్వారా గ్రామపంచాయతీకి ప్రతి ఏడాది రూ.లక్షల ఆదాయం వస్తుంది. వేలం పాటలు దక్కించుకున్న వారు ప్రతి వ్యాపారి నుంచి రూ.20 నుంచి 100 వరకు వసూలు చేస్తున్నారు. అయితే సంత జరిగే ప్రాంతంలో నిర్వహణ శూన్యం. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సంతజరిగే ప్రాంతంలో పరిశుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు.